**దేశంలో పేరున్న ప్యాలెస్‌లన్నీ గొప్ప పాలకులు నిర్మించినవే. పెద్దపెద్ద రాజ్యాలు పాలించిన రాజులు నిర్మించిన ప్రాసాదాలకు తీసిపోని ఓ అద్భుతాన్ని నిర్మించాడో కళాభిమాని. ప్రజల ఆకలి తీర్చడానికి, కళాకారులకు అవకాశాలు కల్పించడానికి ఆయన చేపట్టిన ప్యాలెస్ నిర్మాణం భారతీయ వారసత్వ సంపదగా కీర్తికెక్కింది. ఈ భవన నిర్మాణానికి వాడినన్ని మార్బుల్ రాళ్లను ప్రపంచంలో మరే ప్యాలెస్‌లోనూ ఉపయోగించలేదంటే అతిశయోక్తి కాదు. గొప్ప చిత్రకారుల కళాఖండాలు, అద్భుతమైన శిల్పాలు, అరుదైన జంతు జాతులు ఉండే మార్బుల్ ప్యాలెస్ సంగతులేవో చూసా(చదివే)ద్దామా!**



# చలువరాతి తివాచీ...

## కళలకు కాణాచి





పంతొమ్మిదో శతాబ్దంలో కలకత్తా నగరంలోని సంపన్నులలో రాజా రాజేంద్రలాల్ మాలిక్ ఒకడు. బంగారం, వెండి, ఇతర విలువైన లోహాల వ్యాపారంలో వాళ్ల కుటుంబం విపరీతమైన లాభాలు ఆర్జించింది. సంపన్నుడైన రాజేంద్రలాల్ ఆకలితో ఉన్న ప్రజలకు ఉపాధి కల్పించాలనుకున్నాడు. అదే సమయంలో ఓ అద్భుతమైన నిర్మాణాన్ని సాకారం చేయాలనుకున్నాడు. నిర్మాణ రంగంలో అద్భుతాలు చేయగలిగే వారిని సంప్రదించి, ఓ భవ్య భవనం నిర్మించాలని చెప్పాడు. కళాకారులతోపాటు కూలీలకూ పని దొరుకుతుందని, వారి పనితనం కలకత్తాకు మణిహారం అవుతుందని నమ్మాడు. ఖర్చుకు వెనకాడకుండా ముక్తారామ్‌బాబు వీధిలో ప్యాలెస్ నిర్మాణానికి పూనుకున్నాడు.

**మార్బుల్ కార్పెట్!**

తను నిర్మించబోయే రాజప్రాసాదాల్లో అడుగడుగూ అతిశయంగా ఉండాలని కోరుకున్నాడు రాజేంద్రలాల్. ఎక్కడెక్కడ ఏ రంగు చలువరాయి దొరుకుతుందో తెలుసుకున్నాడు. వ్యయ ప్రయాసలకోర్చి వాటిని తెప్పించాడు. మొత్తంగా 126 రకాల మార్బుల్ రాళ్లు వచ్చి చేరాయి. విలాసవంతమైన ప్యాలెస్ గచ్చుపై రంగురంగుల తివాచీలు అచ్చువేసినట్టు మార్బుల్స్ అమర్చారు నాటి నిర్మాణకారులు. ఆ రంగురాతి పలకలపై నడుస్తుంటే అడుగడుక్కూ అబ్బురం అనిపించేలా ఫ్లోర్‌ను తీర్చిదిద్దారు. 1830లో మొదలైన నిర్మాణం అయిదేండ్లలో పూర్తయింది. ఐరోపాలోని సంప్రదాయ నిర్మాణ రీతులను మేళవించి కట్టిన మహల్ ఇది. చూపరులను కట్టిపడేసేలా ఉన్న ఈ భవన నిర్మాణం అచ్చెరువొందిస్తే.. ఇక ఇందులోని అలంకరణ కోసం చేసిన విన్యాసాలు అత్యద్భుతం అనిపిస్తాయి.



**వైస్రాయ్ మెచ్చిన ప్యాలెస్**

ప్యాలెస్ ప్రధాన ద్వారం ముంగిట నిలిచిన ఎత్తయిన స్తంభాలు రాజేంద్రమాలిక్ ఘనతనే కాదు కళాభిరుచినీ ప్రతిబింబిస్తాయి. కళాపోషణలో మహారాజు అనిపించుకున్న ఆయనకు అరుదైన కళాఖండాలు సేకరించే అభిరుచి ఉండేది. ఐరోపా చిత్రకారులు, సమకాలీన భారతీయ చిత్రకారులు గీసిన చిత్తరువులు, పీటర్ పాల్ రూబెన్స్ చిత్రించిన సెయింట్ కాథరిన్ వివాహ ఘట్టం పెయింటిగ్

